క్లుప్తంగా

అల్లర్లకు పాల్పడితే చర్యలు

– కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్



కడప అర్బన్: కడప అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదనీ, ఉల్లంఘించిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ హెచ్చరించారు. శనివారం డీఎస్పీ పత్రికా ప్రకటన విడుదల చేశారు. జూన్ 6న అనంతరం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ముగిసిన తరువాత పరిశీలించి ర్యాలీలకు, ఊరేగింపులు అనుమతిస్తామ న్నారు. 144 సెక్షన్ అమలులో ఉందని, నలుగురికి మించి గుమికూడదన్నారు. అలాగే 30 పోలీస్ యాక్ట్ కూడా అమలులో ఉందన్నారు. నగరంలో అన్ని రకాల దుకాణాలు రాత్రి 9 గంటలకే మూసివేయాలని తెలిపారు. ట్రబుల్ మాంగర్లు జాగ్రత్తగా వుండాలని, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని కడప డీఎస్పీ హెచ్చరించారు.

నేడు ఆవోపా జనరల్ బాడీ ఎన్నికలు

కడప కల్చరల్ : ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జనరల్ బాడీతో పాటు అధ్యక్షుని ఎన్నిక ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల సత్య ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కడప నగరంలోని అమ్మవారిశాలలో జరిగే ఈ ఎన్నికల్లో అవోపా జీవితకాల సభ్యులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని ఆయన సూచించారు.

నియామకాలను చేపట్టాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభంకానున్న హైస్కూల్ ప్లస్‌లో నియామకాలను వెంటనే చేపట్టాలని ఏపీసీపీఎస్ ఈఏ రాష్ట్ర అదనపు కార్యదర్శి వెంకట జనార్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. జూన్ నెలలో కళాశాలలు మొదలు కాబోతున్నా ఇప్పటి వరకు ఉపాధ్యాయుల నియామకం ప్రక్రియ మొదలు పెట్టకపోవడం వలన విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. అధికారులు వెంటనే నియామకాలను చేపట్టాలన్నారు.

ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన



పనులను ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు, సీపీడీసీ సభ్యులు

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి)లో 1964లో నిర్మించిన ఆడిటోరియం ఆధునికీకరణ పనులకు శనివారం శంకుస్థాపన జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్ అధ్యక్షతన కళాశాల పూర్వ విద్యార్థులు , సీపీడీసీ సభ్యులు రామ్మూర్తి, లయన్ చిన్నపరెడ్డి, నారాయణ రెడ్డి, వెంకటసుబ్బయ్య, పోతుల వెంకట్రామిరెడ్డి, మేడా జనార్దన్, బాల సుబ్రమణ్యం, మురళీధర్, ఆచార్య రాజశేఖర్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు సమక్షంలో పూజా కార్యక్రమాలను నిర్వహించి పనులకు ప్రారంభించారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు ఈ పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చారు.

కమనీయం.. కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఆర్టీపీపీ రోడ్డులోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఆరాధనా మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం గోవిందమాంబ సమేత శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామి, అమ్మవారి మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, శాంతిహోమాలు వేదపండితుల ఆధ్వర్యంలో జరిగాయి. అనంతరం గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయంలోని మండపంలో ఆశీనులను చేశారు. సుమూహూర్తంలో కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను రామేశ్వరం పురవీధుల్లో మంగళవాయిద్యాల మధ్య ఊరేగించారు.

మట్కా బీటర్ అరెస్ట్

కడప అర్బన్: కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో రవీంద్రనగర్‌లో అమీర్ అనే వ్యక్తి మట్కా రాస్తుండగా సీఐ తిమ్మయ్య, తమ సిబ్బందితో కలిసి శనివారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ. 34,200 నగదును, మట్కా స్లిప్‌లను సీజ్ చేశారు.

తల్లీ వాసవాంబా...నమోస్తుతే..



విశేష అలంకారంలో శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి



ప్రధాన కలశాలతో ఉభయదారులు



ఊరేగింపులో పాల్గొన్న మహిళా భక్తులు

కడప కల్చరల్ : జగన్మాత...తల్లీ వాసవాంబ...శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి నమోస్తుతే అంటూ ఆర్యవైశ్యులు తమ ఆరాధ్యదైవమైన కన్యకాంబకు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నుంచి కడప నగరంలోని శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రెండవరోజు తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభావ సేవతో పూజలు ప్రారంభమయ్యాయి. ఎంపిక చేసిన, దీక్షలో ఉన్న 102 మంది కన్యకలు నకాషలోని శ్రీ పాండురంగస్వామి ఆలయం నుంచి క్షీర కలశాలతో ఊరేగింపుగా అమ్మవారిశాలకు వచ్చారు. భక్తులు, కన్యకలు ఊరేగింపులో వాసవాంబకు జై అంటూ నినాదాలు చేస్తూ భక్తిని చాటుకున్నారు. ఆలయం చేరుకున్నాక తాము తెచ్చిన క్షీరంతో అమ్మవారిని అభిషేకించారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో భక్తులు సామూహికంగా కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వాసవీ హోమం, అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ అన్నప్రసాద సౌకర్యం కల్పించారు. రాత్రి విద్యుద్దీపాలు, పూలతో అందంగా అలంకరించి పూల పల్లకీలో అమ్మవారిని కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో కన్యకాపరమేశ్వరీ జయంతి



ప్రత్యేకంగా అలంకరించిన పల్లకి పై అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

కమలాపురం : పట్టణంలో వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి జయంతి మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి వెంకటరమణయ్య, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి జయంతి వేడుకలను నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకి పై అమ్మవారిని పట్టణంలో ఊరేగించారు. మహిళా మండలి ఆధ్వర్యంలో కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం మహా మంగళ హారతి, తీర్థ ప్రసాదములు, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సమీప ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజ లు నిర్వహించారు. పులిహోర అన్నదాన ప్రసాదంతో అమ్మవారి రూపాన్ని తీర్చిదిద్దారు.

20 నుంచి జేవీవీ వేసవి శిక్షణా శిబిరం



శిబిరం సన్నాహక సమావేశంలో పాల్గొన్న జేవీవీ నాయకులు

కడప కల్చరల్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రత్యేకంగా ఈనెల 20వ తేది నుంచి నిర్వహించనున్నట్లు సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏడీ దేవదత్తం తెలిపారు. శనివారం రామకృష్ణనగర్‌లోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో శిబిరం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవిలో సంస్థ ఆధ్వర్యంలో విజ్ఞాన దాయకమైన శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. వేసవి సెలవులను విద్యార్థులు ఉపయుక్తం చేసుకునే దిశగా ఈ శిబిరం ఉపయోగపడుతుందన్నారు. సమయాన్ని వృథా చేసుకోకుండా వినోదంతో కూడిన విజ్ఞాన అంశాలను నేర్చుకోవచ్చని తెలిపారు. జేవీవీ నగర కమిటీ ప్రధాన కార్యదర్శి పైడికాల్వ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో కో ఆపరేటివ్ కాలనీలో 15 రోజులపాటు వేసవి శిక్షణా శిబిరాన్ని నిర్వహించామని, ప్రస్తుతం రామకృష్ణనగర్‌లో నిర్వహించనున్నామన్నారు. ఇందులో సంగీతం, ఆటపాటలు, ఒరిగామి, ఇంగ్లీషు గ్రామర్, ఈజీ మ్యాథ్స్, నీతి కథలు నేర్పుతామన్నారు. ఈనెల 20 నుంచి ప్రతి రోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. సమావేశంలో సంస్థ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ కోశాధికారి సమీర్‌బాష, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజద్‌అలీ, విద్యాకమిటీ సభ్యులు అబ్దుల్, ఐద్వా నాయకులు సుబ్బమ్మ, జేవీవీ సమత కమిటీ సభ్యులు కామేశ్వరమ్మ, డ్రాయింగ్ మాస్టర్ శ్రీనివాసులు, క్రాఫ్ట్ టీచర్ రంగనాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ బాల పోలేరమ్మ జాతర



విశేష అలంకారంలో బాల పోలేరమ్మ



అమ్మవారి ఆలయంలో భక్తుల సందడి

కడప కల్చరల్ : కడప నగరం చిన్నబెస్తవీధిలోని శ్రీ బాల పోలేరమ్మ జాతర శనివారం ప్రారంభమైంది. ఇందులోభాగంగా ఉదయం అమ్మవారి మూలమూర్తికి పంచామృతం, పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని కనుల పండువగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఆలయంతో పాటు ఆ ప్రాంగణాన్ని జాతర వాతావరణం ఉట్టిపడేలా వేప మండలతో అలంకరించారు. స్థానిక భక్తులు ఇళ్ల వద్దనుంచి చల్లకుండలతో మేళ తాళాలతో ఊరేగింపుగా కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి చల్ల సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆ చల్లనే అమ్మవారి ప్రసాదంగా భక్తితో స్వీకరించారు. తమ కుటుంబాలను చల్లగా చూడాలని మొక్కుకున్నారు. సమీప వీధుల్లోని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

జీవనయానంలో కథ మార్గదర్శకం



కథను చెబుతున్న విద్యార్థిని

కడప కల్చరల్ : మానవ జీవనయానంలో కథలు మార్గదర్శనం చేస్తాయని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ఏడీ దేవదత్తం అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కడప నగరం కొండాయపల్లెలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న విద్యార్థుల వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా శనివారం ఆయన అభ్యుదయ గీతాలను విద్యార్థులకు నేర్పారు. ఆయన మాట్లాడుతూ ఆటపాటల ద్వారా మానసిక, శారీరక వికాసం జరుగుతుందని, కథల ద్వారా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. మొబైల్ ఫోన్లు అధికంగా వాడితే జరిగే అనర్థాల గురించి వారికి వివరించారు. విద్యార్థులు కూడా సెల్‌ఫోన్ ద్వారా జరిగే నష్టాలను గురించి చర్చించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ మాట్లాడుతూ మైదానంలో ఆడుకోవడంతో బహుళ ప్రయోజనాలు ఉంటాయని సోదాహరణంగా చిన్నారులకు వివరించారు. ఈ సందర్భంగా కొందరు విద్యార్థులు సహ విద్యార్థులకు తమకు వచ్చిన కథలు చెప్పారు. పాటలు పాడి అలరించారు. ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొనడంతో వినోదంతో పాటు విజ్ఞానం లభించగలదన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ నాదెండ్ల బాబ్జి, సుబ్రమణ్యం, సిబ్బంది సుబ్బమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కారం

ముద్దనూరు : కేసుల పరిష్కారం కోసం నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ భార్గవి సూచించారు. శనివారం మండలంలోని ఓబుళాపురం గ్రామంలో న్యాయమూర్తి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్తులతో మాట్లాడుతూ రాబోయే లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలని, చట్టాలు, నేరాలు, కేసులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ మైనుద్దీన్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే కేసులు నమోదు

– డీఎస్పీ సుధాకర్ హెచ్చరిక

కమలాపురం : ఎన్నికల కోడ్ జూన్ 6 వరకు అమల్లో ఉందని, కోడ్ ఉన్న సమయంలో ఎవరైన అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నియోజకవర్గ నోడల్ ఆఫీసర్, డీఎస్పీ ఎన్.సుధాకర్ హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఏ రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులు గాని, అనుచరులు గాని ఘర్షణలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈనెల 13న ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. అయితే కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు కూడా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సహకరించాలన్నారు. ఈ ముందస్తు చర్యలు శాంతి భద్రతల నిమిత్తం కొనసాగిస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఎలాంటి ఘర్షణలకు దిగవద్దని ఆయన సూచించారు. సమావేశంలో సీఐలు రామకృష్ణారెడ్డి, శంకర్ నాయక్, ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.